# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# జాతీయ వార్తలు

తేదీ: 22-06-2026 సమయం : రాత్రి 8గం. 30ని.లు

## ముఖ్యాంశాలు

❖ గత 12 ఏళ్లలో జరిగిన మార్పులు ప్రభుత్వ పాలనపై ప్రజల విశ్వాసాన్ని బలోపేతం చేయడంలో విజయం సాధించాయని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారు.

❖ లక్నోలోని కోచింగ్ సెంటర్‌లో ఈరోజు జరిగిన అగ్ని ప్రమాదంలో 14 మంది ప్రాణాలు కోల్పోయారు.

❖ `ప్రపంచం ఎదుర్కొంటున్న సాంప్రదాయేతర భద్రతా సవాళ్లు` అనే ఇతివృత్తంతో బ్రిక్స్ జాతీయ భద్రతా సలహాదారుల సమావేశం న్యూఢిల్లీలో ఈరోజు ప్రారంభమైంది.

❖ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ “మన్ కీ బాత్.. మనసులోని మాట” కార్యక్రమం 135వ సంచిక ఈనెల 28న ప్రసారమవుతుంది.

= = = = = = = = = = = = = = = = = = =

గత 12 ఏళ్లలో దేశంలో సంభవించిన మార్పులు ప్రభుత్వ పాలనపై ప్రజల విశ్వాసాన్ని బలోపేతం చేసాయని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. ప్రజా సంక్షేమ పథకాలు లక్షలాది మంది పౌరుల జీవితాలను మరింత సౌకర్యవంతంగా, సురక్షితంగా, గౌరవప్రదంగా మార్చడంలో కీలక పాత్ర పోషించాయని పేర్కొన్నారు. కేంద్ర వాణిజ్యం, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్ రాసిన ఒక వ్యాసాన్ని ఈరోజు సామాజిక మాధ్యమంలో ప్రధానమంత్రి పంచుకుంటూ ఈ విషయాన్ని వెల్లడించారు. సుపరిపాలనకు ప్రజల విశ్వాసమే అతిపెద్ద ఆస్తి అని అన్నారు. నరేంద్ర మోదీ నాయకత్వంలోని 12 ఏళ్ల కేంద్ర ప్రభుత్వ పాలనలో సుపరిపాలన, ప్రజా సంక్షేమం, పేదల జీవితాల్లో వచ్చిన సానుకూల మార్పుల ప్రయాణాన్ని పీయూష్ గోయల్ రాసిన వ్యాసం వివరిస్తుంది.

= = = = = = = = = = = = = = = = = = =

లక్నోలోని అలీగంజ్ లోని ఒక కోచింగ్ సెంటర్‌లో ఈరోజు భారీ అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. ఈ ప్రమాదంలో 14 మంది ప్రాణాలు కోల్పోగా మరికొంత మంతిగాయపడ్డారు. ఆ భవనంలో కోచింగ్ సెంటర్ తో పాటు గేమ్ జోన్, షోరూమ్‌లు కూడా ఉన్నాయి. ఈ ఘటనపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తీవ్ర విచారం వ్యక్తం చేశారు. ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. అలాగే గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. మృతుల కుటుంబాలకు ప్రధానమంత్రి జాతీయ సహాయ నిధి నుంచి 2 లక్షల రూపాయలు, గాయపడిన ప్రతి ఒక్కరికీ 50 వేల రూపాయల చొప్పున ఎక్స్‌గ్రేషియా ఇవ్వనున్నట్లు వెల్లడించారు. సహాయక చర్యలు కొనసాగుతున్నాయని, అధికారులు అన్ని విధాలా సహాయం అందిస్తున్నారని నరేంద్ర మోదీ ఒక ప్రకటనలో తెలిపారు. ఉత్తర ప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి బ్రిజేష్ పాఠక్ ఘటనా స్థలానికి చేరుకుని స్థానిక యంత్రాంగం, పోలీసులు, ఎస్డీఆర్ఎఫ్ బృందాలు చేపడుతున్న సహాయక చర్యలను పర్యవేక్షిస్తున్నారు.

= = = = = = = = = = = = = = = = = = =

కేంద్ర పారిశ్రామిక రక్షణ దళం (సెంట్రల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ ఫోర్స్) (CISF) జాతీయ అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తుందని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ పేర్కొన్నారు. న్యూఢిల్లీలో ఈరోజు జరిగిన CISF ప్రధాన కార్యాలయ భవన నిర్మాణానికి భూమి పూజ, ఇ-ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ... CISF సిబ్బంది దేశ ఆర్థికవృద్ధిని పరిరక్షించే సైనికులని పేర్కొన్నారు. వేలాది మంది సిబ్బందికి, వారి కుటుంబాలకు CISF అందిస్తున్న ప్రాజెక్ట్ మన్ కౌన్సెలింగ్ సేవలను ఆయన ప్రశంసించారు. సైనికుల సంక్షేమం కోసం హోం మంత్రిత్వ శాఖ మంజూరు చేసిన పలు ప్రధాన మౌలిక సదుపాయాల నవీకరణలు, సాంకేతిక పురోగతులు, సంక్షేమ కార్యక్రమాల గురించి కేంద్ర మంత్రి తెలియజేస్తూ...

(వాయిస్ 30 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = =

బ్రిక్స్ జాతీయ భద్రతా సలహాదారుల సమావేశం న్యూఢిల్లీలో ఈరోజు ప్రారంభమైయ్యింది. జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్ అధ్యక్షతన ఈ సమావేశం రెండు రోజుల పాటు జరగనుంది. ఈ కూటమిలోని 11 సభ్య దేశాల భద్రతా ప్రతినిధులు సమావేశంలో పాల్గొంటున్నారు. ఈ కూటమిలో భారత్, బ్రెజిల్, చైనా, ఈజిప్ట్, ఇథియోపియా, ఇండోనేషియా, ఇరాన్, రష్యా, సౌదీ అరేబియా, దక్షిణాఫ్రికా, UAE దేశాలు ఉన్నాయి. `నేడు ప్రపంచం ఎదుర్కొంటున్న సాంప్రదాయేతర భద్రతా సవాళ్లు` అనే ఇతివృత్తంపై ఈ సదస్సు దృష్టి సారిస్తుంది. సైబర్ భద్రత, డిజిటల్ లోపాలు, కృత్రిమ మేధ-ఆధారిత ముప్పులను కూడా సదస్సులో పరిశీలిస్తారు. ఉగ్రవాద నిరోధకం, సమాచార- కమ్యూనికేషన్ సాంకేతికతల వినియోగంలో భద్రతపై ఇటీవల జరిగిన బ్రిక్స్ సంయుక్త కార్యాచరణ బృందాల ఫలితాలను జాతీయ భద్రతా సలహాదారులు, ప్రతినిధి బృందాల అధిపతులు సమీక్షిస్తారు. భారత్ అధ్యక్షతన నాల్గవ సారి ఈ బ్రిక్స్ సమావేశం జరుగుతోంది. అంతకుముందు 2012, 2016, 2021 సంవత్సరాల్లో భారత్ ఈ కూటమికి నాయకత్వం వహించింది.

విరామం

= = = = = = = = = = = = = = = = = = =

పర్యాటక, ఆతిథ్య రంగం అభివృద్ధి లక్షలాది మంది ప్రజల జీవితాల్లో పరివర్తనకు ఒక సాధనమని కేంద్ర సాంస్కృతిక, పర్యాటక శాఖ మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ పేర్కొన్నారు. పర్యాటక, ఆతిథ్య రంగ ప్రతినిధులతో న్యూఢిల్లీలో ఈరోజు నిర్వహించిన `ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ (EoDB) ఇంటరాక్టివ్ సెషన్`లో కేంద్రమంత్రి పాల్గొన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో కేంద్ర ప్రభుత్వం ఉపాధి, అభివృద్ధి, శ్రేయస్సు కోసం కొత్త అవకాశాలను కల్పిస్తోందని ఒక సామాజిక మాధ్యమంలో కేంద్రమంత్రి పేర్కొన్నారు.

= = = = = = = = = = = = = = = = = = =

ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే "మన్ కీ బాత్.. మనసులోని మాట" కార్యక్రమం 135వ సంచిక ఈనెల 28వ తేదీ ఆదివారం ప్రసారమవుతుంది. మన్ కీ బాత్ కార్యక్రమానికి ప్రజలు తమ సూచనలు, సలహాలు అందించాలని ప్రధానమంత్రి కోరారు. ప్రజలు తమ స్వర సందేశాలను 1800 11 7800 నెంబర్‌కు లేదా నరేంద్రమోదీ యాప్‌కు ఈనెల 26వ తేదీ సాయంత్రం వరకు పంపవచ్చు.

= = = = = = = = = = = = = = = = = = =

కేంద్ర సహకార శాఖ మంత్రి అమిత్ షా రేపు న్యూఢిల్లీలో నేషనల్ అగ్రికల్చరల్ కో-ఆపరేటివ్ మార్కెటింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (నాఫెడ్) వేలం పోర్టల్‌ను ప్రారంభించనున్నారు. వేలం ప్రక్రియలో పారదర్శకత, సామర్థ్యం, కార్యకలాపాల సౌలభ్యాన్ని బలోపేతం చేసే దిశగా ఈ పోర్టల్ ఒక ముఖ్యమైన ముందడుగు అని సహకార మంత్రిత్వ శాఖ వెల్లడించింది. రైతులు, భాగస్వాముల ప్రయోజనాల దృష్ట్యా.. వేలం సంబంధిత కార్యకలాపాలను క్రమబద్ధీకరించడానికి, నాఫెడ్ పనితీరును మెరుగుపరచడానికి ఒక డిజిటల్ వేదికను అందిస్తుందని ఆ మంత్రిత్వ శాఖ తెలిపింది. దీంతో పాటు అమిత్ షా అనేక ముఖ్యమైన డిజిటల్, రైతు-కేంద్రీకృత కార్యక్రమాలను కూడా ప్రారంభిస్తారని తెలియజేసింది. ఈ డిజిటల్, సంక్షేమ కార్యక్రమాలు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ `సహకార్ సే సమృద్ధి` దార్శనికతకు, సాంకేతికత, పారదర్శకత, రైతు-కేంద్రీకృత సంస్కరణల ద్వారా సహకార సంస్థలను బలోపేతం చేయాలన్న ప్రభుత్వ ప్రయత్నాలకు అనుగుణంగా ప్రారంభం కానున్నాయని పేర్కొంది.

= = = = = = = = = = = = = = = = = = =

శశి థరూర్ అధ్యక్షతన ఏర్పాటైన పార్లమెంటరీ విదేశీ వ్యవహారాల స్థాయీ సంఘం, వ్యూహాత్మక సరిహద్దు భద్రత, విదేశాంగ విధాన సమస్యలను సమీక్షించేందుకు జమ్మూ కాశ్మీర్, లడఖ్‌లలో నాలుగు రోజుల అధ్యయన పర్యటనను ఈరోజు ప్రారంభించింది. సరిహద్దు నిర్వహణ, సరిహద్దు ప్రాంతాల్లోని భద్రతా పరిస్థితిపై ప్రత్యక్షంగా అవగాహన పొందేందుకు ఈ నెల 25వ తేదీ వరకు జమ్మూ, శ్రీనగర్, కార్గిల్ లేహ్‌లలో ఈ సంఘం పర్యటిస్తుంది. ఈ కమిటీ భారతదేశ ద్వైపాక్షిక సంబంధాలలో ఇటీవలి పరిణామాలు, సింధు జలాల ఒప్పందం నిలిపివేత, నియంత్రణ రేఖ, అంతర్జాతీయ సరిహద్దు వెంబడి ఉగ్రవాదం వల్ల ఎదురయ్యే ముప్పులను పరిశీలిస్తుంది. ఇది భారత్-చైనా సంబంధాలు, తూర్పు లడఖ్‌లోని వాస్తవ నియంత్రణ రేఖ వెంబడి ఉన్న పరిస్థితిపై కూడా దృష్టి సారిస్తోంది. సరిహద్దు ప్రాంతాల్లోని స్థానిక నివాసితులతో సంభాషించడంతో పాటు.. సీనియర్ పౌర సైనిక అధికారులతో ఈ కమిటీ సభ్యులు చర్చలు జరుపుతారు.

= = = = = = = = = = = = = = = = = = =

దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు ఈరోజు లాభాల్లో ముగిశాయి. సెన్సెక్స్ ఉదయం 76 వేల 802 పాయింట్ల వద్ద ప్రారంభమై.. చివరికి 292 పాయింట్ల లాభంతో 77 వేల 094 వద్ద ముగిసింది. నిఫ్టీ సైతం 89 పాయింట్లు లాభపడి 24 వేల 102 వద్ద స్థిరపడింది. డాలరుతో పోలిస్తే రూపాయి మారకం విలువ 94 రూపాయల 70 పైసలుగా ఉంది. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 79.17 డాలర్ల వద్ద కొనసాగుతుండగా.. బంగారం ఔన్సు 4 వేల 210 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.

= = = = = = = = = = = = = = = = = = =

ఓడల రీసైక్లింగ్ లో భారత్ 2025వ సంవత్సరంలో ప్రపంచంలోనే అగ్రగామి దేశంగా నిలిచింది. ప్రపంచ ఓడల రీసైక్లింగ్‌లో భారతదేశ వాటా 2024లో 30 శాతం నుండి 2025 నాటికి 35.4 శాతానికి పెరిగినట్లు ఐక్యరాజ్యసమితి వాణిజ్య, అభివృద్ధి సదస్సు (UNCTAD) తన తాజా నివేదికలో వెల్లడించినట్లు కేంద్ర ఓడరేవులు, నౌకాయానం, జలమార్గాల మంత్రిత్వ శాఖ ఈరోజు ఒక ప్రకటనలో తెలిపింది. దేశంలో ఓడల రీసైక్లింగ్ 2024లోని 1.86 మిలియన్

స్థూల టన్నుల నుండి 2025 నాటికి 2.99 మిలియన్ స్థూల టన్నులకు గణనీయంగా పెరిగిందని, ఇది దాదాపు 60 శాతం అధికమని మంత్రిత్వ శాఖ ఒక ప్రకటనలో తెలిపింది.

====================

====================